క్లుప్తంగా

ఇళ్ల స్థలాలు కేటాయించాలని తహసీల్దార్‌కు వినతి

చిలుకూరు : మండలంలోని నారాయణపురం ఊర చెరువు కట్ట వద్ద నివసిస్తున్న ప్రజలు తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ ధృవకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు ఇళ్ల స్థలాలు లేక చెరువు కట్ట పక్కన తాత్కాలికంగా ఇళ్లు నిర్మించుకోగా ఇటీవల వచ్చిన వరదలతో ఇళ్లు, ఇళ్ల స్థలాలు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉండడానికి ఇళ్లు లేవని, తమకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

హుజూర్‌నగర్ : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.రామారావు, కోఆర్డినేటర్ ప్రియాంక, అధ్యాపకులు సునంద, డాక్టర్ నగేష్, ఎస్.బాలరాజు, నాగార్జున, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, నిఖిల్ వర్మ, శ్రీనివాస్ స్వాతి, శ్రీకాంత్, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ



నోట్ బుక్స్ అందజేస్తున్న వాసవీ, వనితా క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం నేరేడుచర్లకు చెందిన వ్యాపారవేత్త గజపల్లి వెంకటేశ్వర్లు సహకారంతో రూ.4 వేల విలువ గల నోట్ బుక్స్‌ను వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు గెల్లి లక్ష్మీనర్సింహారావు, ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, జూలూరి అశోక్, తాళూరి శ్రీనివాస్, ఉట్కూరి నటరాజ్, రామ్మూర్తి, పుల్లయ్య, సత్యనారాయణ, ఉపాధ్యాయులు వీరబాబు, సైదులు, రషీద్‌ఖాన్, జానకిరాములు, అన్నపూర్ణ, నర్సింహారావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత

మోతె : మండలంలోని కూడలి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన మారపంగు కనకయ్య జ్ఞాపకార్థం తన కూతురు, అల్లుడు చిప్పలపల్లి ప్రణీత రవి బుధవారం ప్లేట్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు బి.వీరన్న, మాజీ సర్పంచ్ సంగెం లింగయ్య, కట్టోజు శ్రీరాములు, మారపంగు ఉపేందర్, గుగులోతు వీర, వెంకన్న, ఉపాధ్యాయులు దేవానందు, నాగయ్య, వీరారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు..

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం దొండపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మునగాల మండలం జగన్నాథపురంనకు చెందిన ఉపాధ్యాయుడు వి.భరత్ బాబు రూ.3 వేల విలువ గల కబడ్డీ క్రీడా సామగ్రిని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సత్తిరెడ్డి భరత్‌బాబును అభినందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టైలర్ ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడిగా చాంద్‌పాష



నేరేడుచర్ల : టైలర్స్ ఓనర్స్ యూనియన్ నేరేడుచర్ల మండల అధ్యక్షుడిగా ఎస్‌కే చాంద్‌పాష నియమితులయ్యారు. బుధవారం నేరేడుచర్లలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసాచారిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు పిల్లమర్రి పుల్లారావు, లతీఫ్, రాజేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఫార్మసిస్ట్ దినోత్సవం



ఆవిష్కరణలను పరిశీలిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

చిలుకూరు : మండలంలోని మిట్స్ మహిళా ఫార్మసీ కళాశాలలో బుధవారం ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మధిర ప్రీతిరెడ్డి మాట్లాడారు. అనంతరం విద్యార్థుల ఆవిష్కరణలను వారు పరిశీలించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమామహేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బద్రంరాజు రాము, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పునరుద్ధరణ పనులు చేపట్టేదెప్పుడో..

- వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలు
- తెగిపోయిన చెరువు కట్ట, రహదారి
- దాదాపు నెల రోజులు కావొస్తున్నా మరమ్మతులు చేపట్టని ప్రభుత్వం
- నష్టపోయిన రైతులకు సాయం అందించడంలోనూ జాప్యం



నల్లచెరువుకు పడిన గండి



బూరుగడ్డలో పొలంలో ఏర్పడిన ఇసుక మేటలు

హుజూర్‌నగర్‌రూరల్ : దాదాపు నెల రోజుల క్రితం కురిసిన భారీ వర్షం హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ, గోపాలపురం గ్రామాలకు అపార నష్టాన్ని మిగిల్చింది. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న నల్లచెరువుకు వరద పోటెత్తడంతో పాటు ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ తెగడంతో పంట పొలాలు పూర్తిగా మునిగి దెబ్బతిన్నాయి. విద్యుత్ మోటార్లు, స్తంభాలు, వైర్లు వరదకు కొట్టుకుపోయాయి. వాగులు, చెరువుల పక్కన పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. పంట పొలాల్లో రాళ్లు తేలాయి. మండల వ్యాప్తంగా సుమారు వెయ్యి ఎకరాలకు పైగా పంట పొలాలు దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు.

రాకపోకలకు ఇబ్బంది..

బూరుగడ్డలోని నల్లచెరువు కట్టకు గండి పడడంతో రహదారి కొట్టుకుపోయింది. గోపాలపురం, బూరుగడ్డ, కరక్కాయలగూడెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఇతర గ్రామాలు, పట్టణానికి వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గాల్లో అదనంగా 5 కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ విద్యార్థులు, ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాలినడకన వెళ్లేవారు చెరువులో నుంచి నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే భారీ వర్షంతో నష్టం జరిగి దాదాపు నెల రోజులు కావొస్తున్నా నేటికీ అధికారులు చెరువు కట్ట, రహదారి పునరుద్ధరణ పనులు చేపట్టలేదు. దీంతో చెరువులో నీరు లేక వరదలో కొట్టుకుపోగా ఉన్న కాస్త కొద్ది పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే కట్టకు, రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ప్రభుత్వం నష్టపోయిన పొలాలకు ఎకరాకు రూ. 50 వేల నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

చెరువు కట్ట, రహదారిని పునరుద్ధరించాలి



వర్షంతో చెరువుకు గండి పడి నెల రోజులు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదు. రహదారి కొట్టుకుపోయి విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రయాణికులకు నిత్యం 5 కిలోమీటర్లు పైగా అదనంగా ప్రయాణం చేసి పట్టణాలకు చేరుకోవాల్సి వస్తోంది. బూరుగడ్డలోని నల్లచెరువు కట్టకు గండిని కూడా పూడ్చలేదు. వెంటనే రహదారి, చెరువు కట్ట పునరుద్ధరణ పనులను ప్రారంభించాలి.

– షేక్ ఇమామ్, కరక్కాయలగూడెం

పంటలు ఎండిపోయేలా ఉన్నాయి



నల్లచెరువు కింద వేసిన పంట పొలాలు నీళ్ల లేక ఎండిపోయేలా ఉన్నాయి. కొంత పొలం వదరలకు కొట్టుకుపోగా మిగిలిన పంట పొలాలు నీళ్ల లేక ఎండిపోతున్నాయి. స్థానిక మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవ తీసుకొని తక్షణమే చెరువు కట్టకు మరమ్మతు పనులు చేపట్టి నీటిని నింపి పంట పొలాలను కాపాడాలి.

– సోమగాని వీరస్వామి, రైతు, బూరుగడ్డ

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ఆలస్యం

- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



గణపవరం వద్ద వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

మునగాల : మండలంలోని గణపవరం సమీపంలో వంతెన నిర్మాణ పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆలస్యంగా జరుగుతున్నాయని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆరోపించారు. బుధవారం వంతెనను ఆయన పరిశీలించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. వంతెన నిర్మాణ ప్రదేశంలో తాత్కాలిక డైవర్షన్ రహదారి ఏర్పాటు చేయకుండా పనులు చేపట్టడంతో ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వంతెన పనుల్లో ఇసుకకు బదులు డస్ట్ వాడుతున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు నాసిరకంగా చేపడుతున్నారని, నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని అన్నారు. తక్షణమే వంతెను పనులు పూర్తి చేసి ప్రజలకు రాకపోకలకు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు సుంకరి అజయ్‌కుమార్, తాడువాయి సహకార సంఘం చైర్మన్ తొగరు సీతారాములు, ఎల్‌పీ.రామయ్య, నాగిరెడ్డి, గౌని శ్రీను, శ్రీనివాసరెడ్డి, నరేష్ ఉన్నారు.

బాధితులందరికీ నష్టపరిహారం అందుతుంది



తొగర్రాయిలో వరద బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ

కోదాడరూరల్ : వరదముంపుకు గురైన బాధితులందరికీ నష్టపరిహారం అందుతుందని, ఎవరూ ఆందోళన చెందొద్దని ఎంపీడీఓ రాంచందర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని తొగర్రాయిలో పలువురు వరద బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. గ్రామం నుంచి 348 మంది బాధితుల వివరాలను ప్రభుత్వానికి పంపించామని, వారిలో ఇప్పటికే కొంతమందికి నష్టపరిహారం నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అయిందని తెలిపారు. ఇంకా నగదు రానివారికి కూడా త్వరలోనే వస్తుందని తెలిపారు. కొందరికి సాంకేతిక సమస్యతో నగదు జమకాలేదని, వారు సమస్య ఎక్కడ ఉందో తెలుసుకుని సంబంధిత పత్రాలు అధికారులకు అందజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, వరద బాధితులు తదితరులు ఉన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం



గర్భిణులకు సీమంతం చేస్తున్న తహసీల్దార్ సరిత, తదితరులు

నడిగూడెం : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని తహసీల్దార్ వి.సరిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ అభియాన్, పోషణ మాసం సందర్భంగా గర్భిణులకు నిర్వహించిన సామూహిక సీమంతం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ పారిజాతం, సూపర్‌వైజర్ రజిని, ఏపీఎం రామలక్ష్మి, ఏఎన్‌ఎంలు, స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు కొండలమ్మ, సవిత, కవిత, స్వర్ణ, శకుంతల, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓలు బాధ్యతల స్వీకరణ



నేరేడుచర్ల : సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



మఠంపల్లి : ఎంఈఓ వెంకటాచారిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



చిలుకూరు : ఎంఈఓ గురవయ్యను సన్మానిస్తున్న కాంప్లెక్స్ చైర్మన్ ఉపాధ్యాయులు

చిలుకూరు : చిలుకూరు మండల నూతన ఎంఈఓగా మండల పరిధిలోని బేతవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురవయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు కాంప్లెక్స్ చైర్మన్ కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మఠంపల్లి మండల ఎంఈఓగా కె.వెంకటాచారి

మఠంపల్లి : మఠంపల్లి మండల ఎంఈఓగా మండలంలోని చౌటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.వెంకటాచారి బుధవారం స్థానిక ఎంఆర్‌సీలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

మేళ్లచెరువు విద్యాధికారిగా వెంకటరెడ్డి

మేళ్లచెరువు : మేళ్లచెరువు మండల విద్యాధికారిగా కాకుమాను వెంకటరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎంఈఓ సైదానాయక్ హుజూర్‌నగర్‌కు బదిలీ కావడంతో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటరెడ్డి ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించారు.

మండల విద్యాధికారిగా సత్యనారాయణరెడ్డి

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల విద్యాధికారిగా పుట్లూరి సత్యనారాయణరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను కాంప్లెక్స్ హెచ్‌ఎంలు బట్టు మధు, ఎల్.శ్రీనివాస్‌రావు, ప్రధానోపాధ్యాయులు పరశురాములు, బాలు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మాతంగి సైదులు, కట్టా శ్రీనివాస్‌రెడ్డి, చల్లా ప్రభాకర్‌రెడ్డి, ప్రభాకర్, ప్రతాప్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, తిరుపతిలు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



బస్తీ దవాఖానాను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్

నేరేడుచర్ల : బస్తీ దవాఖానాలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ కోరారు. బుధవారం మున్సిపాలిటీలోని రాంపురంలో గల బస్తీ దవాఖానాను ఆయన పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి డాక్టర్ సాయిరాంను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దవాఖానాలో రోగులకు వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మందులు సరఫరా కావడం లేదని చెప్పడంతో చైర్మన్ వెంటనే డీఎంహెచ్‌ఓకు ఫోన్ చేసి మందులు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దవాఖానాకు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించే విషయమై ఉన్నతాధికారులు, మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అలక సరిత, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొణతం చినవెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ సరితనగేష్ తదితరులు ఉన్నారు.

మాదక ద్రవ్యాలకు అలవాటు పడొద్దు

నడిగూడెం : మాదక ద్రవ్యాలకు అలవాటు పడవద్దని ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు కరివిరాల మోడల్ స్కూల్‌లో మాదక ద్రవ్యాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డి.విజయకుమార్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సాయిఈశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దేశ భవిష్యత్‌కు మార్క్సిజమే మార్గం



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : దేశ భవిష్యత్‌కు మార్క్సిజమే మార్గమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అమరవరంలో నిర్వహించిన సీపీఎం గ్రామ శాఖ సమావేశంలో ఆయన ఏచూరి సీతారాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శిగా షేక్ ఖాసీంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దుగ్గి బ్రహ్మం, మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్, రేపాకుల మురళి, సైదా, బాలసైదులు, వీరస్వామి, అరవింద్, మహేష్, బుచ్చయ్య, లింగయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

నేరేడుచర్ల : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిరికొండ శ్రీను అన్నారు. బుధవారం మండలంలోని కల్లూరులో సీపీఎం గ్రామ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శిగా బుడిగ ధనుంజయగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బుడిగ లింగయ్య, అంజయ్య, వెంకటయ్య, శ్రీను, సైదులు, జులకంటి సీతన్న, రామనర్సయ్య ఉన్నారు.

వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి

మునగాల : చట్ట సభల్లో వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని భారత వికలాంగుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని కలకోవలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోగుల శేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్య బాబు, మండల అధ్యక్షుడు గోపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, మంచాల వెంకన్న, గిరి, రాములమ్మ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

హుజూర్‌నగర్‌రూరల్ : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎన్‌డీసీఎంసీ డైరెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలోని కరక్కాయలగూడెంలో కొనసాగుతున్న అండర్–14, 17 బాలికల వాలీబాల్, ఖోఖో క్రీడలను నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సోమిరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బొల్లం వెంకటేశ్వర్లు, స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి దేవిశెట్టి రవి, రిటైర్డ్ హెచ్‌ఎంలు అంకతి అప్పయ్య, లక్ష్మీనారాయణ, పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు నాగేంద్రబాబు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్ పర్సన్ పద్మ, మాజీ సర్పంచ్ దొంగరి అరుణసత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ మచ్చా వెంకటేశ్వర్లు, అప్పయ్య, పీఈటీ మైసయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం తగదు

నడిగూడెం : హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి ఉన్న పొట్టి శ్రీరాములు పేరును తొలగించడం తగదని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ వైస్ చైర్మన్ వెంపటి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రైల్వే లైన్ నిర్మాణ సర్వే నిలిపివేయాలి

మఠంపల్లి : మండలంలోని పెదవీడు రెవెన్యూ పరిధిలోని గుర్రంబోడు భూ నిర్వాసితుల భూముల సమస్య పరిష్కరించకుండా సిమెంట్ పరిశ్రమకు రైల్వే లైన్ వేసేందుకు అధికారులు చేపట్టిన సర్వేను వెంటనే నిలిపివేయాలని భూపరిరక్షణ సమితి అధ్యక్షుడు, న్యాయవాది ఇస్లావత్ బాలాజీనాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన బుధవారం స్థానిక తహసీల్దార్ మంగా రాథోడ్‌కు బాధిత రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజనులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ప్రభుత్వ ధరకు భూములను విక్రయించాలని అధికారులు కోరడం ఎంత వరకు సమంజసమని ఆయన అన్నారు. దీనిపై న్యాయ పోరాటానికి దిగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన రైతులు మీట్యానాయక్, కృష్ణ, సైదులు, అంజయ్య, సక్రు, సీతారాం, నాగేష్, తదితరులు ఉన్నారు.

మినిమం టైం స్కేల్ అమలు చేయాలి



సభ్యత్వ నమోదు చేపడుతున్న తెల్కలపల్లి పెంటయ్య

గరిడేపల్లి : కేజీబీవీ ఉపాధ్యాయినులకు మినిమం టైం స్కేల్ అమలు చేసి వారి సర్వీస్‌ను రెగ్యులర్ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య అన్నారు. బుధవారం గరిడేపల్లి మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సభ్యత్వాలను ఆయన నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షురాలు పర్వతం సంధ్యారాణి, నాయకులు హరిప్రసాద్, రవీందర్‌రెడ్డి, తిరుమలేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం



హుజూర్‌నగర్ : చిన్నారుల బరువు నమోదు చేసుకుంటున్న డాక్టర్ కళ్యాణి, సూపర్‌వైజర్

హుజూర్‌నగర్ : సమతుల ఆహారంతోనే ఆరోగ్యం సిద్ధిస్తుందని డాక్టర్ కళ్యాణి అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు– 1, 2, 3, 4, 6, 15ల పరిధిలో వయసుకు, ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. అనంతరం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సోమమ్మ, పీహెచ్‌ఎన్ నూర్జహాన్ బేగం, హెల్త్ అసిస్టెంట్లు ఇందిరాల రామకృష్ణ, విజయశ్రీ, సావిత్రి, అంగన్‌వాడీ టీచర్స్ గోవర్ధిని, సునీత, శాంతరాజ్యం, అక్కమ్మ, రంగమ్మ, నసీమాబేగం, ఆశా కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

నడిగూడెం : ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ గుర్రం విజయ్‌కుమార్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి, పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ఏఎన్‌ఎంలు సుజాత, రాధ, ఆశా కార్యకర్తలు సైదమ్మ, శ్రీలక్ష్మి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోపంతో అనారోగ్యం

గరిడేపల్లి : పోషకాహార లోపంతోనే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేవతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కీతవారిగూడెం సెక్టార్ పరిధిలోని రోగులగడ్డ తండాలో గల అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ మాసం ఉత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్‌సెంటర్ వైద్యాధికారి అశోక్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



హుజూర్‌నగర్ : మిద్దె తోట నిర్వహిస్తున్న దంపతులను సన్మానిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్, కమిషనర్

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి, కమిషనర్ యాకుబ్‌పాషా అన్నారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా బుధవారం హుజూర్‌నగర్‌లోని 25వ వార్డులో ఖాళీ స్థలం, రోడ్ల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం పట్టణంలో జయవాణిదేవి నిర్వహిస్తున్న మిద్దె తోటను పరిశీలించి దంపతులను సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు. పట్టణంలోని రీసైక్లింగ్ ద్వారా వస్తువులు తయారు చేస్తున్న విద్యను సన్మానించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ అశోక్, వార్డు అధికారులు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల మానవహారం

నేరేడుచర్ల : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మానవహారం నిర్వహించి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ వెంకటరమణ, అధ్యాపకులు, వార్డు అధికారులు ఉన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు

నేరేడుచర్ల : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిర్శించర్ల, పెంచికల్‌దిన్నె గ్రామాల్లో పంచాయతీ సిబ్బందికి బుధవారం పెంచికల్‌దిన్నె పీహెచ్‌సీ వైద్యాధికారిని డాక్టర్ సౌమ్యశ్రీ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న సిబ్బందికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి, ఎంపీఓ హరిసింగ్, పంచాయతీ కార్యదర్శులు రమాదేవి, పాలిశెట్టి శ్రీనివాస్‌రావు, సూపర్‌వైజర్ ఆర్.విజయ, వైద్యసిబ్బంది హరికృష్ణ, సాగర్, జానకమ్మ, స్వరూప, తరవి, రమేష్, నాగేశ్వర్‌రావు, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

పెదవీడులో..

మఠంపల్లి : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని పెదవీడులో పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మఠంపల్లి, క్రిష్టాతండా, భీమ్లాతండా, చౌటపల్లి పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. తాగు నీటి సరఫరా పైపు లైన్ల మరమ్మతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి.బి.సుధాకర్‌నాయక్, ఏపీఓ ఉమాదేవి, కార్యదర్శులు, వెంకటేశ్వర్లు, రాజా, భవానీ, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం మండలంలో భారీ వర్షం



నడిగూడెంలో వ్యవసాయ కార్యాలయం చుట్టూ నిలిచిన వర్షపు నీరు



బీసీ కాలనీలో ఇళ్ల మధ్య వర్షపు నీటిని తొలగించేందుకు గండి పెడుతున్న యువకులు

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. నడిగూడెంలోని చౌదరి చెరువు, సారంగేశ్వరస్వామి చెరువు, చెన్నకేశ్వాపురం, ఇంకా పలు గ్రామాల చెరువులు అలుగు పోశాయి. నడిగూడెంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లోకి నీరు చేరింది. బీసీ కాలనీలో ఇళ్ల మధ్య నీరు చేరడంతో ఆ కాలనీకి చెందిన పలువురు యువకులు స్వచ్ఛందంగా గండి పెట్టి నీటిని బయటకు వదిలారు. వల్లాపురంలో పలువురి ఇళ్లల్లోకి నీరు చేరింది. స్థానిక మండల వ్యవసాయశాఖ కార్యాలయం చుట్టూ వర్షపు నీరు చేరింది.

ఎల్బీనగర్ మాజీ సర్పంచ్ మోహన్‌రావు మృతి



మోహన్‌రావు (ఫైల్)

గరిడేపల్లి : మండలంలోని ఎల్బీనగర్ మాజీ సర్పంచ్ అన్నె మోహన్‌రావు (67) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. మోహన్‌రావు 1998 నుంచి 2003 వరకు ఎల్బీనగర్ సర్పంచ్‌గా, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. కాగా, మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.